సాక్షి
మంచిర్యాల
ఆదివారం । 9 । జూలై । 2023



ఆయుష్షు ప్ర'దాతలు'

మనిషి మరణించినా ఈ లోకాన్ని చూడాలంటే నేత్ర దానం వల్ల సాధ్యమవుతుంది. ఒక్కరు అవయవదాతగా మారడం వల్ల తొమ్మిది మందికి జీవితాన్ని ప్రసాదించే అవకాశముంది. 8లో▸



ఘనంగా వైఎస్సార్ జయంతి

దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్‌రెడ్డి జయంతి కార్యక్రమాన్ని శనివారం జిల్లాలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. 9లో▸

గరిష్టం/కనిష్టం
31.0 /26.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. సాయంత్రం వేళ ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది. ఈదురుగాలులు బలంగా వీస్తాయి.

న్యూస్‌రీల్

నేడు క్వారీ దుర్గాదేవి జాతర

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం గఢ్‌పూర్ గ్రామ శివారులోని ఎంసీసీ క్వారీలో ఆదివారం దుర్గాదేవి జాతర వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ఒక ప్రకటనలో తెలిపింది. శనివారం రాత్రి నుంచి ఆదివారం తెల్లవారే వరకు నిత్యపూజలు, హోమ కార్యక్రమాలు, శ్రీవిశ్వనాథాలయ భజన మండలి నిత్య భజన కార్యక్రమాలు ఉంటాయని పేర్కొంది. ఆదివారం ఉదయం 7 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు దుర్గాదేవి దర్శనాలు, కుంకుమార్చనలు, వాహన పూజలు, తీర్థప్రసాద వితరణ ఉంటుందని తెలిపింది.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

మంచిర్యాలక్రైం: క్వారీ జాతర ప్రశాంతంగా జరుపుకోవాలని సీఐ రాజు తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. దట్టమైన అటవీ ప్రాంతం, ప్రమాదకరమైన నీటి మడుగులు ఉన్నందున భక్తులు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. పోలీసులు నిర్దేశించిన ప్రాంతాల్లోనే సంచరించాలని, సాయంత్రం ఐదు గంటల తర్వాత డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. రద్దీ ప్రాంతాల్లో చోరీలు, చైన్‌స్నాచింగ్ జరిగే అవకాశం ఉన్నందున బంగారు నగలు, నగదు తెచ్చుకోవద్దని, దైవదర్శనం ఉదయం 5గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు ఉంటుందని తెలిపారు.

15 మంది ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు

దండేపల్లి: మండలంలోని లింగాపూర్ ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్‌తోపాటు 14 మంది ఉపాధ్యాయులకు డీఈవో యాదయ్య షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఈ మేరకు ఎంఈవో రవీందర్ ఒక ప్రకటన విడుదల చేశారు. గత నెల 26న జిల్లా సెక్టోరియల్ అధికారులు పాఠశాల సందర్శనకు వచ్చారు. పాఠశాల సమయానికి ముందే మధ్యాహ్నం 3.20 గంటలకు ఒక్క ఉపాధ్యాయుడు మినహా ప్రిన్సిపాల్‌తో సహా 15 మంది ఉపాధ్యాయులు వెళ్లిపోయారు. దీంతో వారందరికీ గత నెల 30న డీఈవో షోకాజ్ నోటీసులు జారీ చేశారు. దండేపల్లి ఎమ్మార్సీ కార్యాలయానికి శుక్రవారం అందాయి.

హైవే మార్గం సుగమం!



జైపూర్ మండలం నర్వా శివారు ఎన్‌హెచ్‌-63కి అనుసంధానం కానున్న ఎన్‌హెచ్‌-163జీ గ్రీన్‌ఫీల్డ్ హైవే

- ఎన్‌హెచ్‌–163జీ పనులకు ప్రధాని మోదీ శంకుస్థాపన
- జాతీయ రహదారి నిర్మాణంతో జిల్లాకు మేలు
- మెరుగుపడనున్న అంతర్రాష్ట్ర రోడ్డు రవాణా
- మంచిర్యాల, వరంగల్‌కు తగ్గనున్న దూరం

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: నాగ్‌పూర్–విజయవాడ ఎకనామిక్ కారిడార్‌లో కీలకమైన నాలుగు వరుసల గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారి–163జీ నిర్మాణ పనులకు ప్రధాని నరేంద్రమోదీ శనివారం వరంగల్ జిల్లా పర్యటనలో శంకుస్థాపన చేశారు. రెండేళ్ల క్రితమే జైపూర్ మండలం నర్వా నుంచి వరంగల్, ఖమ్మం మీదుగా విజయవాడ వరకు భారతమాల పరియోజన కింద జాతీయ రహదారుల సంస్థ(ఎన్‌హెచ్‌ఏఐ) జిల్లాకు గ్రీన్‌ఫీల్డ్ హైవే మంజూరు చేసింది. దీంతో గత ఏడాది మార్చి పర్యావరణంపై జైపూర్ మండలంలో ప్రభావిత గ్రామస్తులతో ప్రజాభిప్రాయ సేకరణ జరిగింది. గ్రామాల్లో భూసేకరణ కోసం నోటిఫికేషన్ సైతం విడుదలైంది. ఆయా గ్రామాల్లో 200 ఎకరాల వరకు నష్టపోతున్న భూ నిర్వాసితులకు పరిహారంపై తేల్చకపోవడంతో అభ్యంతరాలు వచ్చాయి. దీంతో కాస్త ఆలస్యమైంది. చివరికి గత మార్చిలో రోడ్డు పనులు మొదలయ్యేందుకు నిర్మాణ సంస్థతో ఒప్పందం కుదిరింది. తాజాగా ప్రధాని మోదీ పర్యటనలో జాతీయ రహదారి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయడంతో మరో నాలుగు వరుసల రోడ్డు అందుబాటులోకి రానుంది. గ్రామాలు, పట్టణాలకు కలపకుండా పూర్తిగా పంట పొలాల మీదుగా ఈ హైవే వెళ్లనుంది. కొత్త హైవే వికారాబాద్ జిల్లా కొడంగల్ నుంచి జనగాం, కాజీపేట, వరంగల్ మీదుగా ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లా భోపాలపట్నం కలిపే ఎన్‌హెచ్‌163కి ఉపయుక్తంగా ఉండనుంది. మొత్తంగా మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల కీలక ఆర్థిక కారిడార్‌గా ఉన్న రోడ్డు రవాణా సులువు కానుంది. అత్యాధునిక సాంకేతిక నిర్మాణంతో రహదారి పనులు జరగనున్నాయి. వచ్చే మూడేళ్లలో పనులు పూర్తి చేయాల్సి ఉంది.

భూ సేకరణ పూర్తయితేనే..

జిల్లా పరిధిలో నిర్మిస్తున్న గ్రీన్‌ఫీల్డ్ హైవేకు జైపూర్ మండలం ప్రభావిత గ్రామాల రైతులకు పరిహారంపై స్పష్టత వస్తేనే పనుల్లో వేగం పెరగనుంది. వరంగల్ జిల్లాలో రైతులు విలువైన భూములు కోల్పోతున్నామని పలుమార్లు నిరసనలు తెలిపారు. దీనిపై భూ సేకరణ కోసం ప్రత్యేకంగా జీవోలు విడుదల చేశారు. ఇప్పటికీ జిల్లా పరిధిలో రైతులు ఒప్పుకోవడం లేదు. ప్రభావిత గ్రామాల్లో రియల్ వ్యాపారం కొనసాగుతుండడంతో భూమి విలువతో పోలిస్తే పరిహారం తక్కువగా ఉంది. దీంతో రైతులకు మెరుగైన పరిహారం ఇస్తేనే పనులు మొదలు కానున్నాయి. రైతుల భూముల్లో రోడ్డు కోసం హద్దులు వేశారు. సేకరించిన భూమికి పరిహారం ఇంకా అందాల్సి ఉంది.

మంచిర్యాల నుంచి విజయవాడ వరకు

పారిశ్రామిక ప్రాంతంగా ఉన్న జిల్లాలో ఇప్పటికే మంచిర్యాల–చంద్రాపూర్‌ను కలిపేలా ఎన్‌హెచ్‌–363, ఆర్మూర్ నుంచి జగ్దల్‌పూర్ ఎన్‌హెచ్‌–63తోపాటు కొత్తగా మంజూరైన ప్రతిపాదిత బెల్లంపల్లి నుంచి గడ్చిరోలీ వరకు జాతీయ రహదారుల పనులు సాగుతున్నాయి. వీటికి తోడు ఎన్‌హెచ్‌–163జీ కూడా మంచిర్యాల నుంచి నాగ్‌పూర్, అటు విజయవాడ వరకు కీలకంగా ఉన్న ఆర్థిక కూడలిని కలిపేందుకు ఉపయోగపడనుంది. ఈ హైవేతో వరంగల్, ఖమ్మం జిల్లా వరకు దూరభారం తగ్గనుంది. ప్రస్తుతం రాజీవ్ రహదారి–1 మీదుగా కరీంనగర్ వెళ్లి అటు నుంచి వయా హుజూరాబాద్ మీదుగా వరంగల్, ఖమ్మం, విజయవాడ వెళ్లాల్సి వస్తోంది. ఈ మార్గంలో దూరభారంతోపాటు సమయం వృథా, అదనపు ఖర్చు అవుతోంది. ఇంధన ఖర్చుతో బొగ్గు, ఇసుక, సిమెంట్, తదితర ముడి సరుకుల రవాణాపై భారం పడుతోంది. కొత్తగా నిర్మిస్తున్న ఈ హైవేతో జిల్లా నుంచి 32కిలోమీటర్లు వరంగల్‌కు దూరం తగ్గి సమయం ఆదా కానుంది. జిల్లాలో జైపూర్ గుండా వెళ్తున్న ఎన్‌హెచ్‌–63కి అనుసంధానించే నర్వా నుంచి ఎల్కంటి, నర్సింగాపూర్, మద్దులపల్లి, కుందారం మీదుగా గోపాల్‌పూర్ నాలుగు వరుసల గ్రీన్‌ఫీల్డ్ హైవే వరకు సాగనుంది. గోదావరి నదిపై బ్రిడ్జి నిర్మించి, పెద్దపల్లి జిల్లా మంథని, భూపాలపల్లి జిల్లా ముత్తారం, మేదరిమెట్ల, వరంగల్ జిల్లా ఉరుగొండ, నెక్కొండ, జనగామ జిల్లా ఆలేరు, పెరుమాండ్ల, ఖమ్మం మీదుగా విజయవాడ వరకు నిర్మాణం జరగనుంది. ప్రస్తుతమున్న రోడ్లకు, గ్రామాలు, పట్టణాల గుండా కాకుండా పూర్తిగా కొత్తగా హైవే నిర్మాణం జరగనుంది. ఆ మేరకు జాతీయ రహదారిపై టోల్ వసూళ్లు ఉండనున్నాయి.

గ్రీన్ ఫీల్డ్ నాలుగు వరుసల ఎన్‌హెచ్‌-163జీ వివరాలు

మొత్తం దూరం	108కిలోమీటర్లు
జిల్లా పరిధిలో దూరం	21.62కిలోమీటర్లు
మూల ధనవ్యయం	రూ.3,441కోట్లు
భారీ వంతెనలు	07
చిన్న వంతెనలు	56
ఆర్వోబీ	01
వీయూపీ/ఎల్‌వీయూపీలు	18/20
విశ్రాంతి ప్రాంతాలు	04
రోడ్డు పూర్తయ్యే సంవత్సరం	2025-26
నిర్మాణ సంస్థ	మెఘా ఇంజనీరింగ్, ఇన్ఫ్రాస్ట్రక్చర్ లి.

చేతులెత్తి మొక్కుతున్న పిల్లలను చదివించండి

- ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య
- పోడు పట్టాల పంపిణీ



గిరిజనులకు పట్టాలు అందజేస్తున్న ఎమ్మెల్యే

వేమనపల్లి: గిరిజన, గిరిజనేతర కుటుంబాలకు చేతులెత్తి మొక్కుతున్న దయచేసి మీ పిల్లలను చదివించండి అని బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య సమావేశానికి వచ్చిన ప్రజలను కోరారు. వేమనపల్లి మండల కేంద్రంలోని రైతువేదికలో శనివారం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 320మంది గిరిజనులకు పోడు హక్కు పత్రాలు అందజేశారు. పిల్లల చదువులకు ప్రభుత్వమే సకల సౌకర్యాలతో ఒక్కో విద్యార్థికి రూ.లక్ష చొప్పున ఖర్చు చేస్తోందని తెలిపారు. పిల్లలను చదివిస్తేనే జీవితాలు బాగుపడుతాయని అన్నారు. నియోజకవర్గంలో సుమారు 1396 మంది గిరిజనులకు హక్కు పత్రాలు మంజూరయ్యాయని తెలిపారు. హక్కు పత్రాలు పొందిన భూములకు రైతుబంధు, పెట్టుబడి సాయం అందజేస్తామన్నారు. సాంకేతిక కారణాలతో హక్కు పత్రాలు రాని వారు ఉంటే సీఎంఓ, కలెక్టర్‌తో మాట్లాడి త్వరలో ఇప్పించే బాధ్యత తనదేనని అన్నారు.

ఏర్పాట్లలో లోపాలపై అసహనం

కాగా, ఈ కార్యక్రమంలో ఏర్పాట్లు సరిగ్గా లేకపోవడంతో అధికారులు, ప్రజాప్రతినిధులపై ఎమ్మెల్యే చిన్నయ్య అసహనం వ్యక్తం చేశారు. మైక్ పని చేయకపోవడం, విద్యుత్ సరఫరాలో అంతరాయంతో మాట్లాడలేక ఇబ్బంది పడ్డారు. ఎంపీడీఓ గారు ఇంత మంచి కార్యక్రమం ఏర్పాటు చేశారు మాట్లాడడానికి మైక్ సరిగా ఉందో లేదో చూసుకోరా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.

వసతులు బాగున్నాయా?

ఆశ్రమ పాఠశాలలో సమస్యలు ఏమైనా ఉన్నాయా, బాగా చదువుకుంటున్నారా అంటూ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య వేమనపల్లి ఏహెచ్‌ఎస్ పాఠశాల విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. శనివారం ఆశ్రమ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు.

తెల్లారిన బతుకులు..!

- వెనుక నుంచి దూసుకొచ్చిన మృత్యువు
- వేకువజామున రోడ్డు ప్రమాదం
- రెండు కుటుంబాల్లో తీరని శోకం
- ఒక కుటుంబంలో భార్య, భర్త, కూతురు మృతి
- మరో కుటుంబంలో వృద్ధురాలు అక్కడికక్కడే మృత్యువాత
- రేపు ఉద్యోగంలో చేరాల్సిన మహిళ కానరాని లోకాలకు
- ప్రార్థనలకు వెళ్లి వస్తుండగా ఘటన



ఆదిలాబాద్‌టౌన్/గుడిహత్నూర్: చీకటి ప్రయాణం వారికి చివరి ప్రయాణమే అయింది. తెల్లవారకముందే వారి జీవితాలు తెల్లారిపోయాయి. వెనుకనుంచి వాహనరూపంలో దూసుకొచ్చిన మృత్యువు నలుగురిని బలితీసుకుంది. జాతీయ రహదారిపై రక్తపు మడుగులో మృతదేహాలు.. ఛిద్రమైన శరీరాలు.. చెల్లాచెదురుగా పడిన మాంసం ముద్దలు.. క్షతగాత్రుల ఆర్తనాదాలు.. చిన్నారుల రోదనలతో ఘటనాస్థలం హృదయ విదారకంగా మారింది.

సంఘటన స్థలంలో మృతదేహాలు, ఆటో



మృతులు గంగమ్మ, శైలజ, సోంబాయి, ఆటో డ్రైవర్ పొచ్చన్న

దేవుడిని ప్రార్థించి.. దేవుడి చెంతకే..

అందరూ క్షేమంగా ఉండాలి.. అంతా మంచి జరగాలని ప్రార్థించి ఇంటికి తిరుగు పయనమైన ఆ ఇరు కుటుంబాల్లో తీరని విషాదం నింపింది. రోడ్డు ప్రమాదం వారిని కానరాని లోకాలకు చేర్చింది. మరికొద్ది నిమిషాల్లో ఇంటికి చేరే క్రమంలో మృత్యువు కబళించింది. గుర్తు తెలియని వాహనం ఢీకొట్టిన ఘటనలో రెండు కుటుంబాల్లో నలుగురు మృతిచెందారు. బాధిత కుటుంబాల రోదనలతో ఆస్పత్రి ప్రాంగణం దద్దరిల్లింది. అనాథలైన చిన్నారుల మౌన రోదన అందరినీ కంటతడి పెట్టించింది. ఆదిలాబాద్ జిల్లా గుడిహత్నూర్ మండలం మేకలగండి ప్రాంతంలో శనివారం తెల్లవారుజామున 4 గంటల సమయంలో ఆటోను గుర్తు తెలియని వాహనం వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఏముల పొచ్చన్న(58), ఏముల గంగమ్మ(48), శైలజ(28), మడావి సోంబాయి (63) సంఘటనా స్థలంలోనే తుది శ్వాస విడిచారు. మరో ఐదుగురు గాయాలపాలయ్యారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. వీరిలో ఇద్దరు పిల్లల పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. సంఘటన స్థలాన్ని ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి, ఉట్నూర్ డీఎస్పీ నాగేందర్ సందర్శించారు.

అసలేం జరిగిందంటే..

ఇంద్రవెల్లి మండలం కేస్లాగూడకు చెందిన పొచ్చన్న బతుకుదెరువు నిమిత్తం కొన్నేళ్ల క్రితం ఆదిలాబాద్ పట్టణంలోని రవీంద్రనగర్ వచ్చి ఓ ఇంట్లో అద్దెకు ఉంటున్నాడు. ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈయనకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు. వీరందరికీ పెళ్లిళ్లు అయ్యాయి. వీరి కుటుంబం ప్రతినెలా రెండో శుక్రవారం ఆల్‌నైట్ ప్రేయర్(ప్రార్థన) కోసం ఇచ్చోడలోని హోలీ మౌంటెన్ చర్చికి వెళ్తుంటారు. ఈ క్రమంలోనే పొచ్చన్న తన కుటుంబ సభ్యులతోపాటు ఆదిలాబాద్ పట్టణంలోని బాలాజీ గార్డెన్ సమీపంలో ఉంటున్న మడావి సోంబాయి(సలోమి) కుటుంబ సభ్యులతో కలిసి తన ఆటోలో సాయంత్రం చర్చికి బయల్దేరి వెళ్లారు. పొచ్చన్న, ఆయన భార్య గంగమ్మ, కూతురు శైలజ, ఇద్దరు మనుమరాళ్లు, ఒక మనుమడుతోపాటు సోంబాయి, ఆమె పెద్ద కుమారుడు ప్రేమ్‌సాగర్, మనుమడు దీపక్‌రాజ్‌తో కలిపి తొమ్మిది మంది బయల్దేరి వెళ్లారు. ఇచ్చోడలోని చర్చిలో రాత్రి 9 నుంచి శనివారం తెల్లవారుజామున 3 గంటల వరకు ప్రార్థనలు జరిగాయి. అప్పటివరకు సంతోషంగా గడిపిన ఇరు కుటుంబాలు ఇంటికి తిరుగుపయనం అయ్యారు. పొచ్చన్న స్కూల్ పిల్లలను ప్రతీరోజు ఆటోలో తీసుకెళ్తుంటాడు. తెల్లారితే స్కూల్ ఉంటుందనే ఉద్దేశంతో వేకువజామునే అక్కడినుంచి బయల్దేరారు. గమ్యస్థానం మరో 15కిలోమీటర్ల దూరం ఉండగా మేకలగండి వద్ద రోడ్డు ప్రమాదం చోటు చేసుకొని మరణించారు. వెనక నుంచి ఆటోను గుర్తు తెలియని వాహనం(పోలీసులు లారీగా భావిస్తున్నారు) ఢీకొనడంతో ఆటోలో ప్రయాణిస్తున్న వారంతా ఎగిరిపడ్డారు. వాహనం నుజ్జునుజ్జయింది. ఆ సమయంలో ఆదిలాబాద్ మార్కెట్‌కు కూరగాయలు తీసుకొస్తున్న రైతులు ఈ ఘటనను చూసి పోలీసులకు సమాచారం అందించారు. వారు వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. క్షతగాత్రులను రిమ్స్ ఆస్పత్రికి తరలించారు.



మృత్యువును జయించిన చిన్నారి

మృత్యువును జయించిన చిన్నారులు..

ప్రమాదంలో నలుగురు అక్కడికక్కడే మృతిచెందగా, మిగతా ఐదుగురికి గాయాలయ్యాయి. శైలజ మృతిచెందగా, ఆమెతో ఉన్న ఇద్దరు కూతుళ్లు మాత్రం మృత్యువును జయించారు. మూడేళ్ల ఆరాధ్య, ఎనిమిది నెలల పసిబిడ్డ అర్పిత సురక్షితంగా బయటపడ్డారు. తల్లి మరణంతో ఆ చిన్నారులు అనాథలుగా మిగిలారు. కనీసం ఊహ తెలియని వీరు తల్లి కోసం రోధించిన తీరు అందరినీ కంటతడి పెట్టించింది.

కేస్లాగూడలో అంత్యక్రియలు

ఇంద్రవెల్లి: మేకలగండి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఏముల పొచ్చన్న, భార్య గంగమ్మ, కూతురు శైలజ మృతిచెందడంతో వారి స్వగ్రామమైన మండలంలోని కేస్లాగూడలో విషాదఛాయలు అలుముకున్నాయి. అంత్యక్రియల నిమిత్తం వారి మృతదేహాలను గ్రామానికి తరలించడంతో గ్రామస్తులు శోకసంద్రంలో మునిగిపోయారు. బంధువులు, కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. అనంతరం ఏమాయికుంట శ్మశాన వాటికకు తరలించి అంత్యక్రియలు నిర్వహించారు.

ఉద్యోగంలో చేరక ముందే..

జన్నారానికి చెందిన దాసరి కిరణ్‌తో శైలజకు కొన్నేళ్ల క్రితం వివాహం జరిగింది. ఈమె రిమ్స్‌లో ఔట్ సోర్సింగ్ పద్ధతిన స్టాఫ్‌నర్స్‌గా పనిచేసింది. కరోనా తర్వాత ఆమెను విధుల నుంచి తొలగించారు. గర్భిణి అయిన ఆమె ప్రసవం కోసం ఇటీవలే ఆదిలాబాద్ పట్టణంలో పుట్టింటికి వచ్చింది. ఎనిమిది నెలల క్రితం ప్రసవం అయింది. ప్రస్తుతం తల్లిగారి ఇంట్లోనే ఇద్దరు కూతుళ్లతో ఉంటోంది. ఇటీవల ఆమెకు ఉట్నూర్ మండలంలోని దండెపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్టాఫ్‌నర్సుగా ఉద్యోగం రావడంతో అమ్మ, నాన్న, తన కూతుళ్లతో కలిసి ఇచ్చోడ చర్చికి వెళ్లింది. తిరుగు ప్రయాణంలో తండ్రి పొచ్చన్న, తల్లి గంగమ్మతో మృత్యువు ఒడిలోకి చేరింది. ఇదిలా ఉండగా పొచ్చన్న పెద్ద కుమార్తె విజయ కుమారుడు తేజవర్ధన్ వీరితోపాటే ఉన్నాడు. ఆ బాలుడికి కాలు విరిగింది. ఊపిరితిత్తులు, ఛాతి భాగంలో ఎముకలు విరిగినట్లు వైద్యులు నిర్ధారించారు. కాగా మరో కుటుంబానికి చెందిన సోంబాయి వెంట ఆమె పెద్ద కుమారుడు ప్రేమ్‌సాగర్‌తోపాటు ఆయన కుమారుడు దీపక్‌రాజ్ ఉన్నారు. వీరిద్దరు ఈ ప్రమాదంలో గాయాలపాలయ్యారు. ప్రస్తుతం రిమ్స్‌లో చికిత్స పొందుతున్నారు.

అతివేగమే కారణం : ఎస్పీ

మేకలగండి వద్ద జరిగిన ప్రమాదానికి అతివేగమే కారణమని ఎస్పీ డి.ఉదయ్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఏ వాహనం ఢీకొట్టిందనే విషయం తెలియలేదన్నారు. వాహనాన్ని గుర్తించేందుకు జాతీయ రహదారిపైనున్న సీసీ కెమెరాలు పరిశీలిస్తున్నట్లుగా తెలిపారు. ఘటనా స్థలాన్ని పరిశీలించి ప్రమాదానికి గల కారణాలపై ఆరా తీశారు. గుడిహత్నూర్ నుంచి ఆదిలాబాద్ వరకు గల జాతీయ రహదారి ఎన్నో మలుపులతో కూడుకుని ఉందన్నారు. దీంతో ఎగువ నుంచి దిగువ ప్రాంతానికి వచ్చే క్రమంలో భారీ వాహనదారులు ఇంధనం పొదుపు చేయాలనే ఉద్దేశంతో వాహనాలను న్యూట్రల్‌లో ఉంచి నడపడం ప్రమాదాలకు కారణమవుతున్నాయన్నారు. వీటిని అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామన్నారు. ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న ప్రదేశాలను గుర్తించి హెచ్చరిక బోర్డులు, రహదారిపై రంబుల్‌స్ట్రిప్స్‌ను ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. ఉట్నూర్ సీఐ రామకృష్ణ ఉన్నారు.

నిరుద్యోగుల్లో ఆశలు

- టెట్ నిర్వహణకు కసరత్తు
- అభ్యర్థుల ఎదురుచూపులు

మంచిర్యాలఅర్బన్: ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్) త్వరలో నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఖాళీగా ఉన్న టీచర్ పోస్టులు భర్తీ చేసేందుకు టెట్ నిర్వహణకు కేబినెట్ సబ్‌కమిటీ ఆమోదం తెలిపింది. ఇతర ఉద్యోగాల భర్తీ ప్రక్రియ కొనసాగుతున్నా డీఎస్సీపై ఇప్పటివరకు ఎలాంటి స్పష్టత లేదు. గతేడాది విద్యాశాఖ టెట్ నిర్వహించగా డీఎస్సీ నోటిఫికేషన్ వస్తుందని అంతా భావించారు. 2017 జూలైలో చివరిసారి నిర్వహించగా ఆ తర్వాత ఉపాధ్యాయ నియామకాలు చేపట్టలేదు. 2022 జూన్ 12న టెట్ నిర్వహించారు. టీచర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్లు వస్తున్నాయన్న ఆశతో ఎక్కువ మంది పరీక్ష రాశారు. ఏడాది గడిచినా ఆ ఊసే లేకపోవడంతో టెట్ అర్హత పొందిన వారంతా ఎదురు చూస్తున్నారు. ఈ నేపథ్యంలో మరోసారి టెట్ నిర్వహణకు కసరత్తు చేస్తుండడంతో అభ్యర్థుల్లో ఆశలు చిగురిస్తున్నాయి.

జిల్లాలో ఖాళీలు

జిల్లాలో 686 పాఠశాలల్లో 39,439 మంది విద్యార్థులు చదువుతున్నారు. 2,839 మంది ఉపాధ్యాయ పోస్టులకు గాను 2,322 మంది విధులు నిర్వర్తిస్తున్నారు. 472 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఉపాధ్యాయ పదోన్నతులు, బదిలీల తర్వాతే ఖాళీలపై పూర్తి స్థాయిలో స్పష్టత వచ్చే అవకాశాలున్నాయి. ఇంకోవైపు ఉపాధ్యాయ అర్హత పరీక్ష కోసం ఉపాధ్యాయ శిక్షణ పూర్తి చేసిన వేలాది మంది నిరుద్యోగ అభ్యర్థులు ఎదురు చూస్తున్నారు. గతంలో బీఈడీ, డీఈడీ పూర్తి చేసి టెట్ కోసం ఎదురు చూస్తున్న అభ్యర్థులు దాదాపుగా 4,600పైన ఉంటారనే అంచనా. ఎంప్లాయిమెంట్ రిజిస్ట్రేషన్‌లో పేర్లు నమోదు చేసుకున్నది వందల్లోనే ఉన్నారు. ఎంప్లాయిమెంట్ కార్యాలయంలో బీఈడీ చేసిన వారు 423, టీటీసీ 108 మంది మాత్రమే తమ పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ఇంతకాలం ఉద్యోగ నోటిఫికేషన్లు లేకపోవడంతో పేర్ల నమోదుకు అనాసక్తి చూపినట్లు తెలుస్తోంది.

పేర్లు నమోదు చేసుకోవాలి

ఎంప్లాయిమెంట్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేసుకుంటే మంచిది. ఏదైనా ఉద్యోగ సమయంలో ఎంప్లాయిమెంట్ రిజిస్ట్రేషన్(పేర్ల నమోదు) కోడ్ తప్పనిసరి చేస్తే ఇబ్బందులు పడకుండా ముందుగా తీసుకోవాలి. ఎస్ఎస్‌సీ నుంచి ఉన్నత చదువులు చదివినా ప్రతి ఒక్కరూ ఎంప్లాయిమెంట్ ఆఫీస్‌లో పేర్లు నమోదు చేసుకోవాలి. ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశం ఉంది. సందేహాల నివృత్తి కోసం 9704456299 నంబరులో సంప్రదించవచ్చు.

– వెంకటరమణ, ఎంప్లాయిమెంట్ ఆఫీసర్

క్లుప్తంగా

ఫొటోగ్రఫీలో అవార్డు



అవార్డు అందుకుంటున్న అరుణ్‌కుమార్

రామకృష్ణాపూర్(చెన్నూర్): సిగ్మా అకాడమీ ఆధ్వర్యంలో ఈ నెల 2 నుండి 4 వరకు గోవా లోని లాగ్రేస్ రిసార్ట్‌లో నిర్వహించిన జాతీయ స్థాయి ఫొటోగ్రఫీ వర్క్‌షాప్‌లో రామకృష్ణాపూర్‌కు చెందిన బండి అరుణ్‌కుమార్ ప్రతిభ కనబరిచాడు. వర్క్‌షాపులో చివరిరోజు నిర్వహించిన కాంపిటీషన్‌లో గ్లామర్ విభాగంలో గోల్డ్ మెడల్ సాధించాడు. అరుణ్‌ను స్థానిక ఫొటోగ్రాఫర్లు అభినందించారు.

యూబీఐతో ప్రమాదబీమా ఒప్పందం

మందమర్రిరూరల్(చెన్నూర్): యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (యూబీఐ)తో సింగరేణి సంస్థ ప్రమాదబీమా ఒప్పందం చేసుకుందని మందమర్రి ఏరియా జీఎం మోహన్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాతో ఒప్పందం ఉందని యూబీఐ ఖాతా ఉన్న ఉద్యోగులు బ్యాంక్‌లో సూపర్ సాలరీ ఎకౌంట్‌గా మార్చుకోవాలని సూచించారు. ఏదైనా ప్రమాదం జరిగితే రూ. 40 లక్షలు ప్రమాదబీమాతో పాటు అదనపు ప్రయోజనాలు వర్తిస్తాయని జీఎం తెలిపారు.

'బీసీ జనగణన కోసం ఉద్యమించాలి'

పాతమంచిర్యాల: బీసీ జనగణనకోసం ఉద్యమించాలని బీసీ సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. శనివారం జిల్లా కేంద్రంలో బీసీ సంఘాల ఐక్యవేదిక నాయకులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీసీ జనగణన చేపట్టాలనే డిమాండ్‌లో ఈ నెల 16న జిల్లా కేంద్రంలో నిరసనదీక్ష చేపట్టనున్నట్లు తెలిపారు. దేశంలో మెజార్టీ వర్గంగా ఉన్న బీసీలకు సంక్షేమ ఫలాలు దక్కాలంటే కేంద్ర ప్రభుత్వం తక్షణమే బీసీ జనాభా లెక్కలు సేకరించాలన్నారు.. సమావేశంలో బీసీ ఐక్యవేదిక కన్వీనర్ వడ్డేపల్లి మనోహర్, సామాజిక న్యాయవేదిక కన్వీనర్ రంగు రాజేశం, నాయకులు మల్లయ్య, చంద్రమౌళి, కర్రె లచ్చన్న, రాజన్నయాదవ్, రాజారెడ్డి, అంజయ్య, సురేంద్రాచారి, మొగిళి లక్ష్మణ్, మల్లేశ్, రాజశేఖర్ పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

కాగజ్‌నగర్‌రూరల్: కుటుంబ కలహాలతో యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. రూరల్ ఎస్సై సోనియా తెలిపిన వివరాల ప్రకారం కాగజ్‌నగర్ పట్టణంలోని పెట్రోల్‌పంపు ఏరియాకు చెందిన షేక్ అనీఫ్ (32) శుక్రవారం కుటుంబ సభ్యులతో గొడవపెట్టుకుని ఇంటినుంచి బయటకు వెళ్లాడు. శనివారం కోసిని రిజర్వాయర్‌లో మృతదేహం గుర్తించిన గ్రామస్తులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

రైళ్ల రద్దు పొడగింపు

మంచిర్యాలక్రైం: హైదరాబాద్–సికింద్రాబాద్ రైల్వే డివిజన్ పరిధిలో రైల్వే ట్రాక్ మరమ్మతుల దృష్ట్యా ఈ నెల 3 నుంచి 9 వరకు రద్దయిన రైళ్లను ఈ నెల 16 వరకు పొడగించినట్లు రైల్వే అధికారులు తెలిపారు. ప్రయాణికులు పూర్తి వివరాలకు రైల్వే స్టేషన్‌లో సంప్రదించాలని ఆయన పేర్కొన్నారు.

కొనసాగుతున్న సమ్మె

కాసిపేట(బెల్లంపల్లి): మందమర్రి ఏరియా కేకే ఓపెన్‌కాస్టులో ఆర్‌వీఆర్ కాంట్రాక్టు సంస్థ వేతనాల చెల్లింపులో అన్యాయం చేస్తుందని కాంట్రాక్టు కార్మి కులు చేపట్టిన సమ్మె శనివారం నాలుగోరోజుకు చేరింది. కాంట్రాక్టు డ్రైవర్లు ఉదయం ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్యను క్యాంపు ఆఫీసులో కలిసి విన్నవించగా సాయంత్రం వరకు సమస్య పరిష్కరించనున్నట్లు తెలిపినప్పటికీ ఎలాంటి స్పందన లేకపోవడంతో సమ్మె కొనసాగుతోంది.

ఆయుష్షు ప్రదాతలు..!

• అవయవాల దానంతో కొందరికి పునర్జన్మ • ముందుకొస్తున్న కుటుంబ సభ్యులు • నేత్ర, శరీర దానానికి అంగీకారపత్రాలు

సాక్షి, మంచిర్యాల డెస్క్: మనిషి మరణించినా ఈ లోకాన్ని చూడాలంటే నేత్రదానం వల్ల సాధ్యమవుతుంది. ఒక్కరు అవయవదాతగా మారడం వల్ల తొమ్మిది మందికి జీవితాన్ని ప్రసాదించే అవకాశం ఉంది. అవయవదానంపై ప్రజల్లో అవగాహన పెరగడం వల్ల దాతల సంఖ్య పెరుగుతూ వస్తోంది. వైద్యులు ఒక వ్యక్తిని బ్రెయిన్‌డెడ్‌గా ప్రకటించిన తర్వాత కుటుంబ సభ్యులు దుఃఖాన్ని దిగమింగి అవయవదానం చేస్తూ మరికొందరి కుటుంబాల్లో వెలుగును ప్రసాదిస్తున్నారు.



మరణానంతరం శరీరదానానికి అంగీకార పత్రాలతో కార్మెల్ హైస్కూల్ సిస్టర్స్(ఫైల్)

నలుగురిలో ఒకరికే చూపు..!



చూపును ప్రసాదించాలంటే దేశంలో ప్రతీ సంవత్సరం రెండు లక్షల కార్నియాలు అవసరమని, కానీ 50వేలు మాత్రమే దాతల నుంచి సేకరిస్తున్నారని అంచనా. దాతలు ముందుకు రాకపోవడం వల్ల ప్రతీ నలుగురిలో ముగ్గురు ఎదురుచూడాల్సి వస్తోంది. నేత్రదానానికి ముందుకొస్తున్నా ఇంకా ఆ సంఖ్య పెరగాల్సి ఉంది. గుండె, లివర్, కళ్లు, ఊపిరితిత్తులు, కిడ్నీలు, పాంక్రియాస్ దానం చేయవచ్చు. వీటిని రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జీవన్‌దాన్ ద్వారా అవసరమైన బాధితులకు అమర్చే వీలుంది. ఈ ఏడాది ఇప్పటివరకు తెలుగు రాష్ట్రాల్లోని 381మందికి కిడ్నీలు, లివర్, గుండె, కార్నియాలు, ఊపిరితిత్తులు అమర్చారు.

సండే స్పెషల్

దాతలుగా మారాలంటే..

ఎవరైనా అవయవదాతలుగా మారవచ్చు. జీవన్‌దాన్ వెబ్‌సైట్ ద్వారా, సదాశయ ఫౌండేషన్‌ను సంప్రదించి వివరాలను నమోదు చేసుకోవచ్చు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నేత్ర, అవయవదానంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దాతలుగా ముందుకొచ్చిన వారి నుంచి అంగీకార పత్రాలు స్వీకరిస్తున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో అవయవ, శరీర, నేత్ర దానంపై 900కు పైగా అవగాహన సదస్సులు నిర్వహించారు. తమ తదనంతరం నేత్ర, అవయవ, శరీరదానాలకు ముందుకొచ్చి అంగీకారపత్రాలు అందజేసిన వారు 50 వేల మందికి పైగా ఉన్నారు. ఇప్పటివరకు 650 మంది నేత్రదానం, అవయవదానం చేసిన వారు 80 మంది, శరీరదానం చేసిన వారు 90 మంది వరకు ఉన్నారు.

అంగీకారం..

• మంచిర్యాలలోని కార్మెల్ హైస్కూల్ సిస్టర్లు మరణానంతరం శరీర దానానికి ముందుకొచ్చి అంగీకార పత్రాలు అందజేశారు.

• మంచిర్యాల జిల్లా బెల్లంపల్లిలో జనహిత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో 2018లో నేత్ర, అవయవదాన అవగాహన సదస్సు నిర్వహించారు. 300 మంది నుంచి నేత్ర, అవయవ దానానికి అంగీకార పత్రాలు స్వీకరించారు.

• ఈ నెల 3న శ్రీరాంపూర్ గనిలో మెకానికల్ ఫోర్‌మెన్ కే.వెంకటేశం, ఎస్‌డీఎల్ ఆపరేటర్ బుద్ధి ప్రసాద్ అవయవ దానం చేయడానికి అంగీకారపత్రాలు అందజేశారు. వారిని గని మేనేజర్ ఫౌండేషన్ సభ్యులు ఘనంగా సన్మానించి ప్రశంసాపత్రం అందజేశారు.



పార్థివదేహాన్ని వరంగల్ కాకతీయ మెడికల్ కాలేజీకి అప్పగిస్తున్న సదాశయ ఫౌండేషన్ సభ్యులు (ఫైల్)

నలుగురికి పునర్జన్మనిచ్చిన ఆర్‌ఎంపీ



రమేష్(ఫైల్)

నిర్మల్ జిల్లా కుంటాల మండల కేంద్రానికి చెందిన మైన రమేష్(41) వృత్తిరీత్యా ఆర్‌ఎంపీ. హఠాత్తుగా బీపీ పడిపోవడంతో ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని కార్పొరేట్ ఆస్పత్రికి తరలించగా మూడు రోజుల చికిత్స తర్వాత వైద్యులు బ్రెయిన్‌డెడ్‌గా ప్రకటించారు. రమేష్ భార్య రేఖ అతడి అవయవదానానికి ముందుకొచ్చింది. దీంతో ఈ ఏడాది జూన్ 21న గుండె, కిడ్నీలు, లివర్‌ను నలుగురికి అమర్చడం ద్వారా రమేష్ వైద్యుడిగానే కాకుండా మరణిస్తూ పునర్జన్మ ప్రసాదించాడు.

• మంచిర్యాల జిల్లా చెన్నూర్‌కు చెందిన జన్నం కళావతి అనారోగ్యంతో ఈ ఏడాది జనవరి 22న మృతిచెందగా సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కుటుంబ సభ్యులు రామగుండం మెడికల్ కళాశాలకు పార్థివదేహాన్ని అప్పగించారు.

• మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్ ఏరియా సింగరేణి ఉద్యోగి కామెర శంకర్ 2018లో మృతిచెందగా.. కుటుంబ సభ్యులు ఆయన కిడ్నీలు, లివర్, గుండె దానం చేశారు.

• మంచిర్యాల జిల్లా చెన్నూర్ మండలం సోమన్‌పల్లి గ్రామానికి చెందిన తుమ్మల ప్రశాంత్‌రెడ్డి, కోటపల్లి మండలం బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన చల్లా తిరుపతిరెడ్డి మరణానంతరం అవయవాలు దానం చేశారు.

• మంచిర్యాల జిల్లా రామకృష్ణాపూర్‌కు చెందిన ఇంజినీరింగ్ విద్యార్థి సృజన్‌సింహా రైలు ప్రమాదంలో గాయపడి మృతి చెందాడు. గుండె, కళ్లు, ఊపిరితిత్తులు, మూత్రపిండాలు, కాలేయం కుటుంబ సభ్యులు దానం చేయగా.. ఇతరులకు అమర్చారు.

ఇదీ వెబ్‌సైట్
www.jeevandan.gov.in
సదాశయ ఫౌండేషన్‌ను సంప్రదించాల్సిన నంబర్లు
టి.శ్రవణ్‌కుమార్, వ్యవస్థాపక అధ్యక్షుడు : 99486 09591
సీహెచ్.లింగమూర్తి, ప్రధాన కార్యదర్శి 94927 81306

చట్టం చేయాలి..



ప్రతి ఒక్కరూ అవయవదానానికి ముందుకు రావాలి. మనకు ఎందుకూ పనికిరానివి.. సమాజానికి పనికొచ్చేవి.. రూ.కోట్లు వెచ్చించినా దొరకని నేత్ర, అవయవాలను మనం వృథా చేయకూడదు. దీనిపై ప్రతి ఒక్కరూ అవయవదానం చేసేలా.. రాష్ట్రపతి నుంచి సామాన్యుడి వరకు నేత్ర, అవయవదానం ఏది వీలైతే అది చేసేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చట్టం చేయాలి. మా తమ్ముడు టి.అశోక్‌కుమార్ కాళోజీ నారాయణరావును స్ఫూర్తిగా తీసుకుని శరీర దానానికి అంగీకరించాడు. 2006లో మరణించగా అతడి కోరిక మేరకు కాకతీయ మెడికల్ కాలేజీకి మృతదేహాన్ని అప్పగించాం. ఆయన స్ఫూర్తితోనే 2008లో గోదావరిఖనిలో సదాశయ ఫౌండేషన్ ప్రారంభించాం. రాష్ట్ర వ్యాప్తంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. – శ్రవణ్‌కుమార్, సదాశయ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు

వైద్య పరిశోధనకు ఉపయోగ పడాలని..



రవి కుటుంబం

మరణానంతరం వైద్య పరిశోధనలకు శరీరం ఉపయోగపడాలనే ఉద్దేశంతో అవయవాలు, శరీర దానానికి కుటుంబమంతా అంగీకరించారు. మంచిర్యాల జిల్లా కాసిపేట మండలం ట్యాంక్‌బస్తీకి చెందిన సీపీఎం జిల్లా కార్యదర్శి సంకె రవి, తన భార్య రాజకుమారి, కుమారుడు ప్రణయ్, కూతురు శ్రీనిత అవయవదాన అంగీకార పత్రాలు అందజేశారు. వీరితోపాటు అతని సోదరుడి కుటుంబం సంకె శ్రావణిదేవి, లక్ష్మి, సుశాంతిలూ ముందుకొచ్చారు.

నల్లబ్యాడ్జీలతో ఏఐటీయూసీ నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

శ్రీరాంపూర్(మంచిర్యాల): ప్రధాని నరేంద్ర మోదీ వరంగల్ పర్యటనను నిరసిస్తూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో శనివారం అన్ని గనులు, డిపార్టుమెంట్లపై నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆ యూనియన్ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి ఎస్కే బాజీ సైదా మాట్లాడుతూ బొగ్గుగని కార్మికులకు నరేంద్ర మోదీ తీవ్ర అన్యాయం చేశారన్నారు. 44 కార్మిక చట్టాలను నాలుగు కోడ్‌లుగా మార్చి కార్మికుల హక్కులను కాలరాశారన్నారు. కార్మికులను బానిసలుగా పనిచేసే చట్టాలు చేశారని విమర్శించారు. సింగరేణిలో నాలుగు బొగ్గు బ్లాకులను ప్రైవేటు సంస్థలకు కట్టబెట్టి మోదీ గోబ్యాక్ అంటూ నినాదాలు చేశారు. సింగరేణి కాంట్రాక్టీకరణ, ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కార్మికులంతా ఐక్య పోరాటాలకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఆర్కే 7 గనిపై ఆ యూనియన్ డెప్యూటీ ప్రధాన కార్యదర్శి కే వీరభద్రయ్య, బ్రాంచ్ సెక్రటరీ కొట్టి కిషన్‌రావు, ఎస్సార్పీ 1 గనిపై బ్రాంచి కార్యదర్శి మోత్కూరి కొమురయ్య ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఆయా గనులపై జరిగిన కార్యక్రమాల్లో ఆ యూనియన్ పిట్ సెక్రెటరీలు సారయ్య, దాడి రాజయ్య, నర్సింగరావు, మల్లేశ్, లక్ష్మణ్, నాయకులు చంద్రమోహన్, సత్తయ్య, వేణు, రాజేంద్రప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

'చిందు కళాకారులను ఆదుకోవాలి'



లక్ష్మీనర్సయ్యను సన్మానిస్తున్న కళాకారులు

చెన్నూర్: వెండితెర, బుల్లితెరల జోరుతో జానపద కళావేదికలు నిర్వీర్యమై దుర్భర జీవనం సాగిస్తున్న చిందు కళాకారులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని చిందు హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు రాయిల లక్ష్మీనర్సయ్య అన్నారు. శనివారం పట్టణంలో జిల్లా కార్యవర్గ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం జిల్లా కేంద్రంలో చిందు కుల సంఘ భవనానికి 500 చదరపు గజాల స్థలం కేటాయించాలని, దళితబంధు, ఇంటి స్థలాలతో పాటు నిర్మాణానికి గృహలక్ష్మి పథకం కింద రూ.3లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం సంఘం జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గడ్డం రామచంద్రం, ముఖ్య సలహాదారునిగా గడ్డం లింగమూర్తి, అధికార ప్రతినిధిగా మొగిలి, ఉపాధ్యక్షులుగా ప్రశాంత్, ప్రధాన కార్యదర్శిగా రామచంద్రయ్య ఎన్నికయ్యారు. కార్యక్రమంలో ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు చిరంజీవి, చిందు కళాకారులు పాల్గొన్నారు.

అప్పుల బాధతో మహిళ ఆత్మహత్య

బెజ్జూర్(సిర్పూర్): అప్పుల బాధ భరించలేక మహిళ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని కొత్తగూడలో చోటు చేసుకుంది. ఎస్సై వెంకటేశ్ తెలిపిన వివరాల ప్రకారం కాగజ్‌నగర్ మండలంలోని ఇస్గాం క్యాంప్ నంబర్ 6కు చెందిన ప్రియాంక దేవనాథ్ (29) తన భర్త తుషార్‌తో కలిసి బతుకుదెరువు కోసం కొన్నేళ్ల క్రితం బెజ్జూర్ మండలం రెబ్బన గ్రామ పంచాయతీ పరిధిలోని కొత్తగూడకు వచ్చారు. గ్రామంలో కిరాణా దుకాణం నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నారు. పది నెలల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో తుషార్ కోమాలోకి వెళ్లాడు. అతనికి చికిత్స అందించేందుకు రూ.9 లక్షల అప్పు చేశారు. భర్త కోమాలో ఉండడంతో పాటు అప్పులు తీర్చడం ఎలా అని కొద్ది రోజులుగా మానసికంగా బాధపడుతోంది. శుక్రవారం రాత్రి ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. శనివారం మృతదేహాన్ని పోలీసులు పరిశీలించి పంచానామ కోసం సిర్పూర్(టి) సామాజిక ఆస్పత్రికి తరలించారు. మృతురాలికి ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. అటు తండ్రి అనారోగ్యం పాలుకావడం, ఇటు తల్లి ఆత్మహత్య చేసుకోవడంతో అనాథలైన చిన్నారులు తల్లి మృతదేహంపై రోదించిన తీరు అందర్నీ కలిచివేసింది. మృతురాలి తండ్రి తారక్ మండల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

రాజశేఖరరెడ్డి జయంతి వేడుకల్లో జిల్లా నాయకులు



వైఎస్సార్ జయంతిలో నగేశ్

మంచిర్యాలక్రైం: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి 74వ జయంతి వేడుకల్లో వైఎస్సార్ టీపీ వ్యవస్థాపక అధ్యక్షురాలు వైఎస్ షర్మిలతో పాటు మంచిర్యాల జిల్లా చెన్నూర్ నియోజకవర్గం వైఎస్సార్ టీపీ ఎమ్మెల్యే అభ్యర్థి, జిల్లా కో– ఆర్డినేటర్ దుర్గం నగేష్ జయంతి వేడుకల్లో పాల్గొన్నారు. ఇడుపుల పాయలోని రాజశేఖరరెడ్డి ఘాట్ వద్ద నిర్వహించిన ఈ వేడుకల్లో పూలమాలతో ఘనంగా నివాళులర్పించారు.

కాంగ్రెస్ శ్రేణులకు షోకాజ్ నోటీసులు

బెల్లంపల్లి: బెల్లంపల్లికి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులకు పార్టీ క్రమ శిక్షణ సంఘం షోకాజ్ నోటీసులు పంపించినట్లు తెలిసింది. స్థానిక నాయకులు కొందరు పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని, మీడియా సమావేశంలో బహిరంగంగా విమర్శలు చేస్తూ పార్టీ ప్రతిష్టను దిగజారుస్తున్నారని ప్రత్యర్థి వర్గం పార్టీ క్రమ శిక్షణ కమిటీ రాష్ట్ర చైర్మన్ చిన్నారెడ్డికి ఫిర్యాదు చేసింది. దీంతో డీసీసీ ఉపాధ్యక్షుడు తొంగల మల్లేశ్, టీపీసీసీ సభ్యుడు చిలుముల శంకర్, డీసీసీ సభ్యురాలు రొడ్డ శారద, ఓబీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండి ప్రభాకర్, నాయకులు నాతరి స్వామి, వేముల కృష్ణ, వేల్పుల రోహిత్, ఎండి గౌస్‌లకు షోకాజ్ నోటీసులను పంపించారు. షోకాజ్ నోటీసు అందుకున్న అంశాన్నీ ప్రత్యర్థి వర్గం ఇప్పటి వరకు గోప్యంగా ఉంచగా శనివారం సంబంధిత నాయకులు గాంధీ భవన్‌కు వెళ్లి సంజాయిషీ ఇచ్చే రోజున బహిర్గతం చేయడం ప్రాధాన్యతను సంతరించుకుంది.

'బెల్లంపల్లి కాంగ్రెస్ టిక్కెట్ స్థానికులకే ఇవ్వాలి'

బెల్లంపల్లి: బెల్లంపల్లి కాంగ్రెస్ టిక్కెట్‌ను స్థానికులకు మాత్రమే ఇవ్వాలని అసెంబ్లీ నియోజకవర్గ నాయకులు సీఎల్పీ నేత భట్టి విక్రమార్కను కోరారు. శనివారం గాంధీభవన్‌కు వెళ్లి వినతి పత్రం అందజేశారు. అసెంబ్లీ నియోజకవర్గంలో కాంగ్రెస్‌కు అనుకూల పరిస్థితులు ఉన్నాయని, స్థానికుల్లో సమర్థులను గుర్తించి టిక్కెట్ ఇస్తే గెలిపించుకుంటామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి, కాంగ్రెస్ ఓబీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండి ప్రభాకర్, డీసీసీ సభ్యురాలు రొడ్డ శారద, నాయకులు నాతరి స్వామి, వేముల కృష్ణ, జయరాం, ఎండీ అఫ్జల్, కటకం సతీష్‌కుమార్, సిలివేరి సత్యనారాయణ, శ్యామ్, గౌస్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

• తపస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నవాత్ సురేష్



మాట్లాడుతున్న సురేష్

మంచిర్యాలఅర్బన్: దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయుల సంఘం(తపస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నవాత్ సురేష్ డిమాండ్ చేశారు. శనివారం మంచిర్యాల సరస్వతీ శిశు మందిర్ ఉన్నత పాఠశాలలో తపస్ జిల్లాస్థాయి ప్రశిక్షణ వర్గకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈసందర్భగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలు చేపట్టాలని, పెండింగ్‌లో ఉన్న బిల్లులన్నీ క్లియర్ చేయాలని, పాఠశాలల్లో పారిశుధ్య కార్మికులను నియమించాలని, ఒకటో తేదీన జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తపస్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి బగ్గని రవికుమార్, రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి బండి రమేశ్, రాష్ట్ర అకాడమిక్ కోకన్వీనర్ విద్యాసాగర్, సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణరెడ్డి, జిల్లా బాధ్యులు నీలేష్, శ్రీధర్, రమాదేవి, మధుకర్, సాంబయ్య, నాగరాజ్, తోడే తిరుపతి, శ్రీకాంత్, వేణుగోపాల్, లక్ష్మణాచారి, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

జీపీ సామగ్రి తరలింపుపై ఆందోళన



ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

దండేపల్లి(మంచిర్యాల): మండలంలోని రాజుగూడ పంచాయతీ కార్యాలయ సామగ్రిని సర్పంచ్ లచ్చు పటేల్ తన సొంత గ్రామమైన జైతుగూడకు తరలించడాన్ని నిరసిస్తూ గ్రామస్తులు శనివారం పంచాయతీ కార్యాలయం వద్ద బైఠాయించి ఆందోళన చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రాజుగూడ జీపీని జైతుగూడకు తరలించాలనే ఉద్దేశంతోనే సామగ్రిని తరలిస్తున్నారని ఆరోపించారు. రాజుగూడ జీపీ కార్యాలయం ప్రస్తుతం అద్దె భవనంలో కొనసాగుతోందని, ఇటీవలే నిధులు మంజూరుకావడంతో జైతుగూడలో పక్కాభవనం నిర్మించాలని చూస్తున్నారన్నారు. దీనిని తాము వ్యతిరేకిస్తున్నామన్నారు. ఈ విషయమై సర్పంచ్ లచ్చు పటేల్‌ను ఫోన్‌లో సంప్రదించగా రాజుగూడ పంచాయతీ కార్యాలయంలో ఉరుస్తుండడంతో జీపీ సామగ్రిని జైతుగూడ పాఠశాలలో భద్రపరిచామన్నారు. పంచాయతీ పక్కా భవన నిర్మాణాన్ని జీపీ పరిధిలోని నాలుగు గూడేల ప్రజలు కోరిన చోట నిర్మిస్తామన్నారు.

'పది' జవాబు పత్రమే మారింది

• రీ వెరిఫికేషన్‌లో బోర్డు అధికారుల నిర్వాకం



అధికారులు పంపిన మరో విద్యార్థి జవాబు పత్రం

కాసిపేట(బెల్లంపల్లి): మంచిర్యాల జిల్లా కాసిపేట మండలానికి చెందిన పదోతరగతి విద్యార్థి రీ వెరిఫికేషన్‌కు దరఖాస్తు చేసుకోగా వేరే వారి జవాబు పత్రం రావడంతో తల్లిదండ్రులు అవాక్కయ్యారు. సోమగూడెం ఎన్‌టీఆర్ కాలనికి చెందిన కనగంటి హన్సిక్ (హాల్‌టికెట్ నంబర్ 2303107 527) పరీక్షల్లో 8.8జీపీఏ సాధించాడు. సైన్స్ సబ్జెక్టులో 7జీపీఏ రావడంతో రీ వెరిఫికేషన్‌కు దరఖాస్తు చేసుకున్నాడు. రెండ్రోజుల క్రితం బోర్డు అధికారులు కోటపల్లి మండలానికి చెందిన కోండ్ర హసిత(హాల్‌టికెట్ నంబర్ 2303107136)కు చెందిన తెలుగు మీడియం ఇంగ్లిష్ పేపర్‌ను పంపించారు. సైన్స్ పేపర్‌కు బదులు ఇంగ్లిష్ పేపర్ రావడం, ఇంగ్లిష్ మీడియంకు తెలుగు పేపర్ రావడంతో తల్లిదండ్రులు అవాక్కయ్యారు. తమకు న్యాయం చేయాలని, అధికారులపై చర్యలు తీసుకుని తమ వివరాలు పంపించాలని విద్యార్థి తండ్రి రాజమల్లు కోరుతున్నాడు.

ఎన్నికల తనిఖీలు షురూ

మంచిర్యాలక్రైం: రానున్న ఎన్నికల నేపథ్యంలో పోలీస్ శాఖ అలర్ట్ అయ్యింది. ముందస్తు చర్యల్లో భాగంగా అక్రమ రవాణా, నిషేధిత వస్తువుల రవాణా అడ్డుకునేందుకు వాహనాల తనిఖీలు నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని ప్రధాన చౌరస్తాల వద్ద రెండు బృందాలుగా ఏర్పడి ద్విచక్రవాహనాలు, కార్లను తనిఖీ చేశారు. కార్ల అద్దాలకు ఉన్న బ్లాక్ ఫిలిమ్‌ను తొలగించారు. అనుమానితుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. సీఐ మాట్లాడుతూ వాహనాలకు బ్లాక్ ఫిలిమ్ ఉంటే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. తనిఖీల్లో ఎస్సై ఉదయ్‌కిరణ్, సిబ్బంది పాల్గొన్నారు.